# స్త్రీ పురుష బేధం లేకుండా ప్రతిఒక్కరు తప్పనిసరిగా విద్యను అర్జించాలి



• షేఖ్ అబ్దుల్ బాసిత్.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూన్ 19 / అక్షరం న్యూస్ -:

చదువు సంస్కారం నేర్పుతుంది. నైతిక విలువలతో కూడిన చదువును ప్రతిఒక్కరు అర్జించాలని ప్రవక్త ముహమ్మద్ 1450 సంవత్సరాల క్రితమే బోధించారని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ స్థానిక మేదరబస్తి లోని మస్జిద్ ఏ వహీద్ లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని ఆయన మాట్లాడుతూ.

నేడు మానవతా విలువలతో కూడిన విద్య కనుమరుగయ్యా పోతుంది అని, ఆర్జించిన జ్ఞానాన్ని మానవ హితం కన్నా మానవ వినాశనానికే ఎక్కువగా ఉపయోగించ బడుతుంది అని ఆవేదన వ్యక్తం చేసారు. నేడు విద్య వ్యాపార వస్తువుగా మారిపోయింది అని, విద్యను డబ్బు సంపాదనే దేయంగా మారిపోయింది అని ఫలితంగా మనుషులు మధ్య సత్ సంబంధాలు కనుమరుగు అయ్యాయని అన్నారు. ఇస్లాం జ్ఞానాన్ని మానవ హితం కోసం ఆర్జించాలని కొరుతుంది. విద్య నిజ దైవాన్ని గుర్తించి, చావు పుట్టుక నడుమ జీవిత మర్మాన్ని తెలుసుకుని జీవించేలా చేయాలని ఆకాంక్షిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ సంతానానికి ఇచ్చే అత్యుత్తమ బహుమానం చక్కని చదువు సంస్కారాలే అని, చదువును సమాజ హితం కోసం కాకుండా, స్వార్థం స్వలాభం కోసం వినియోగిస్తే నరక శిక్ష



అనుబవించ వలసి ఉంటుంది అని హెచ్చరించారని అన్నారు. ఎప్పుడు? ఎక్కడ? ఎలా? ముగిసి పోతుందో తెలియని క్షణ భంగుర ప్రాపంచిక మాయలో పడకుండా, ఆర్జించిన జ్ఞానాన్ని సాటి మానవాళి బాగు కోసం వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మౌలానా గౌసుద్దీన్. అజ్జర్ బేగ్, జబ్బార్ సాబ్, గాజీసలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# 23న కమ్మ సేవా సమితిలో సింగరేణి పరిరక్షణ సదస్సు

- సింగరేణి సంస్థలో జరుగుతున్న పరిణామాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్.
- హాజరుకానున్న హరీష్ రావు, తెలంగాణ బొగ్గు పని కార్మిక సంఘం నాయకులు.
- విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన రాజిరెడ్డి.



భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ జూన్ 19 / అక్షరం న్యూస్ -:


ఈనెల 23న కొత్తగూడెం కమ్మ సేవా సమితిలో సింగరేణి పరిరక్షణ సదస్సు ఉంటుందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థలో జరుగుతున్న పరిణామాల పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ సదస్సులో ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. మెడికల్ బోర్డు ఎప్పుడు పెడతారని, 15 నెలలుగా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదన్నారు. అలాగే జులై, నవంబర్, మే లో జరిగిన అడ్వైస్డ్ రివ్యూ బోర్డు రిపోర్టును ఎందుకు విడుదల చేయలేదని అడిగారు. మారుపేరుల సమస్యకు పరిష్కారం చూపుతారా..? 250 గజాల ఇళ్ల స్థలం ఇస్తారా లేదా..? రియంబర్స్మెంట్ ఉంటుందా లేదా అని పలు ప్రశ్నలు సంధించారు. 20 నుంచి 30 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తారా లేదా అని అడిగారు. ఈ అన్ని అంశాలపై ఈనెల 23న కొత్తగూడెం కమ్మ సేవాసమితిలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారని తెలియజేశారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కెళ్ళపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు హాజారవుతారని చెప్పారు.

# రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు













వరంగల్ జిల్లా / వరంగల్ టౌన్ / జూన్ 19 / అక్షరం న్యూస్ -:

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రేపటి భావి ప్రధాని రాహుల్ గాంధీ 56 వ జన్మదిన పురస్కరించుకొని వరంగల్ పోచమ్మ సెంటర్లో కేక్ కట్ చేసి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకోవడం జరిగినది. రాహుల్ గాంధీ 14వ ఏట ఉన్నప్పుడు శ్రీమతి ఇందిరా గాంధీ ని, 21 ఏట ఉన్నప్పుడు తన తండ్రి రాజీవ్ గాంధీ ని సంఘవిద్రోహులు అకారణంగా కాల్చి చంపడాన్ని చూసి ధైర్యం కోల్పోకుండా మొక్కవోని దీక్షతో ఈ దేశానికి తన ముత్తాత నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఏవైతే కలలు కంటూ అభివృద్ధి బీజాలు వేశారో వాటి ఫలాలు సామాన్యుడికి అందే విధంగా చూడాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పి ప్రగాఢంగా నమ్ముతూ ఏదైతే మరో పక్క బిజెపి పార్టీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఇది చూసిన రాహుల్ గాంధీ దేశంలో ప్రజల మధ్య కులమతాలకతీతంగా ప్రేమను పంచాలి అని చెప్పుకుంటూ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్రను ఘనంగా నిర్వహిస్తూ ప్రజలకు ఒక భారత దేశ సార్వభౌమాధికారంతో పాటు ప్రజాస్వామ్యం లౌకికవాదాన్ని ఈ దేశం యొక్క ప్రధాన నినాదం అని తెలపడం జరిగినది. ఈరోజు దేశంలో చూసుకుంటే ఓవైపు ఓటు మనువాద సామ్రాజ్యంతో మత విద్వేషాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేసే కార్యక్రమంలో ఉంటే చోరీ అని చెప్పి చెప్పుకుంటూ పోతూ ఉంటే బిజెపి ప్రభుత్వం నేడు సీటు చోరీకి పాల్పడం నిజంగా కూడా సిగ్గుచేటుగా అభివర్ణిస్తూ రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ ని ప్రధాని చేసే వరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కంకణ బద్ధులై పనిచేస్తారని చెప్పి ప్రమాణం చేస్తూ మరొకసారి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, నల్లగొండ రమేష్, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బసవరాజ్ శిరీష, శ్రీమాన్, జన్ను, అనిల్ జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షుడు చిలువేరు శీను మాజీ కార్పొరేటర్లు తత్తరి లక్ష్మణ్, దామెర సర్వేశ్ జన్ను అరుణ్ జన్ను రవి వరంగల్ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు కొరవి పరమేష్ వరంగల్ అధ్యక్షుడు సలీం, విజన్ అధ్యక్షులు కరుణాకర్, సాజిద్ సన్నీ సందీప్ బొలిగుడు శ్రీనివాస్, ఇంతియాజ్, ప్రవీణ్ మాజీ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు గోరంటాల రాజు. మరాఠీ ప్రభాకర్ కమల్ భాష గిన్నారం రాజు సీనియర్ నాయకుడు జన్ను ఆదాము కూర తోట సదానందం తజముల్ ఖాన్ దినేష్ మహిళా సోషల్ మీడియా అధ్యక్షురాలు సోమలక్ష్మి గిరి పుష్ప కొయ్యడ ఉమా గజ్జల లింగమూర్తి చంద్రమౌళి హోలీవుడ్ శీను తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నకొండలో వివిధ అభివృద్ధి కార్యక్రమంలలో పాల్గొన్న ఎమ్మెల్యే



చొప్పదండి/ కరీంనగర్,జూన్ 19 (అక్షరం న్యూస్ )

చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న రాజన్నల సంఘ భవనం, నాయీ బ్రాహ్మణ సంఘ భవనాల నిర్మాణ పనులకు శుక్రవారం రోజున ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం భూమి పూజ చేశారు. తదుపరి చొప్పదండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కోడిగుడ్లను ఎలా తింటే శరీరానికి అధిక మొత్తంలో పోషకాలు లభిస్తాయి..

అత్యంత పోషకపరమైన ఆహారాల్లో గుడ్లు కూడా ఒకటి. వీటిని రోజూ వారి ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి కనుక వీటిని సంపూర్ణ ఆహారంగా చెప్పవచ్చు. గుడ్లు కంప్లీట్ ప్రోటీన్ గా పరిగణిం చబడతాయి. శరీరం స్వయంగా తయారు చేసుకోలేని తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు గుడ్డులో ఉంటాయి. కండరాల పునరుద్ధరణలో, పెరుగుదలలో, శరీర పనితీరుకు ఇవి ఎంతో సహాయపడతాయి. వీటితో పాటు గుడ్డులో విటమిన్ బి12, విటమిన్ డి, సెలీనియం, కొలిన్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. బరువును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కంటి ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. గుడ్డును వివిధ రూపాల్లో వండుకుని తీసుకుంటూ ఉంటారు. అయితే గుడ్లను వండే విధానం వాటి పోషక విలువలపై ప్రభావం చూపిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

## ఉడకబెట్టి లేదా పోచింగ్ చేసి..

గుడ్లను కొందరు పచ్చిగా తీసుకుంటారు. అయితే ఇలా తీసుకోవడానికి బదులుగా గుడ్లను వండి తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ప్రోటీన్ సులభంగా జీర్ణమవుతుంది. అలాగే గుడ్డులో ఉండే బయోటిన్ అనే విటమిన్ ను శరీరం సులభంగా ఉపయోగించుకోగలుగుతుంది.

## ఉచిత కంటి వైద్య సేవలు నిరంతరం



## కొనసాగుతాయి వంశీ

ఓదెల/ పెద్దపల్లి జూన్ 19(అక్షరం న్యూస్)

ఓదెల మండలం కేంద్రంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలు ఉచిత వైద్య కంటి శిబిరాలను వినియోగించుకొని కంటి సమస్యలను తొలగించుకోవాలని కంటి వైద్య సహాయకులు లగిశెట్టి వంశీ పేర్కొన్నారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం దాదాపు పదిమందికి కరీంనగర్ చెలిమెడ ఆనందరావు ఆసుపత్రిలోఉచిత అత్యాధునిక కంటి శాస్త్ర చికిత్స చేయడం విజయవంతమైందని పేర్కొన్నారు అదేవిధంగా ఓదెలా పెరకపల్లె దండపల్లె మరియు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఓదెల మండలంలోని ఉచిత కంటి వైద్య సేవలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు అదేవిధంగా లైన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాప అధ్యక్షుడు నేత్ర వైద్య నిపుణులు పూదరి దత్త గౌడ్. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుండి నడిపిస్తున్నాడని గ్రామంలో కంటి సమస్య లేని గ్రామాలను తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని పేర్కొన్నారు ఇంకెవరికైనా సమస్యలు ఉంటే మమ్మల్ని సంప్రదించాలని కంటి శుక్లాలు పొరలు ఉన్నవారు ఓదెల దక్కన్ గ్రామీణ బ్యాంకు పక్క లక్ష్మీ ఐ కేర్ ఆప్టికల్ ను సంప్రదించవచ్చని అదేవిధంగా 7032975096 ఫోన్ ద్వారా కూడా సంప్రదించాలని వైద్య నిపుణులు వంశీ పేర్కొన్నారు




## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ఓదెల /పెద్దపల్లి జూన్19(అక్షరం న్యూస్)

ఓదెల మండలం కొలనూర్ లో కాంగ్రెస్ అగ్ర నాయకులు , భావి భారతానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సీట్ల పంపిణీ చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండేటి ఐలయ్య యాదవ్ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరస్తున్న నియంత ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తున్న పోరాట యోధుడు, ప్రజా నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారుభావి భారతదేశానికి కాబోయే ప్రధాని అని దేశ భవిష్యత్తు కోసమే నిరంతరం తపిస్తూ భారత్ జోడయాత్ర ద్వారా దేశమంతా పాదయాత్ర చేసి ప్రజలను చైతన్య పరిచి ప్రజల అనేక సమస్యలను పార్లమెంట్లో వినిపించే వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారుపెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు ఆదేశాల స్థానిక నాయకులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు...ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బైరి రవి గౌడ్ , సతురి రాజేశం, సుధాకర్ రెడ్డి,కొమురయ్య, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

**కొత్తగూడ మండలంలోని లాడాయిగడ్డ గ్రామంలో పిడుగు పడటంతో కొబ్బరి చెట్టు దగ్ధమైంది.**



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ జూన్ 20(అక్షరం న్యూస్ ) కొత్తగూడ మండలంలోని లాడాయిగడ్డ గ్రామంలో పిడుగు పడటంతో కొబ్బరి చెట్టు దగ్ధమైంది. గ్రామానికి చెందిన బీరవెల్లి సుదర్శన్ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడ్డ సమయంలో పిడుగు పడింది. పిడుగు తీవ్రతకు చెట్టు పైభాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో మంటలు, పొగలు ఎగసిపడగా స్థానికులు భయాందోళనకు గురయ్యారు

## పాదాల వద్ద వాపులు తరచూ వస్తున్నాయా..?

ఎక్కువసేపు నిలబడటం, ప్రయాణాలు చేయడం లేదా ఒకే స్థితిలో కూర్చోవడం వల్ల చీలమండలు వాపు రావడం సాధారణం. అయితే ఈ వాపు తరచుగా కొనసాగితే, అది లోపల ఉన్న ఆరోగ్య సమస్యలకు సంకేతంగా మారవచ్చని వైద్యులు చెబుతున్నారు. వైద్యులు ఇలాంటి పరిస్థితుల్లో ఆంకిల్ స్వెల్లింగ్ టెస్ట్ లేదా పిట్టింగ్ ఎడిమా టెస్ట్ అనే సులభమైన పరీక్ష ద్వారా శరీరంలో ద్రవం నిల్వ ఉందో లేదో పరీక్షచేస్తారు. ఈ పరీక్ష చాలా సులభంగా ఉంటుంది. చీలమండలం దగ్గర లేదా కాలి మోకాలిపై వైద్యుడు కొన్ని సెకన్లు వేళ్లతో నొక్కి వదిలేస్తారు. నొక్కిన తర్వాత చర్మం వెంటనే మామూలు స్థితికి వస్తే పెద్ద సమస్య ఉండకపోవచ్చు. కానీ ఆ చోట చిన్న గుంతలా మిగిలితే దానిని పిట్టింగ్ ఎడిమా అంటారు. ఇది శరీరంలో ద్రవం ఎక్కువగా నిల్వ ఉన్న సంకేతంగా పరిగణించబడుతుంది.

### కారణాలు ఇవే..

శరీరంలో ద్రవం ఎక్కువగా పేరుకుపోవడానికి ముఖ్య కారణం రక్తప్రసరణలో లేదా ద్రవ సమతుల్యంలో లోపం రావడం. గురుత్వాకర్షణ వల్ల ఈ ద్రవం కాళ్లు, పాదాల దగ్గర ఎక్కువగా చేరుతుంది.

# ప్రమాదకరంగా రోడ్డు క్రాసింగ్లల వద్ద డివైడర్ లపై సెంట్రల్ లైటింగ్ స్తంబాలకు కడుతున్న నాయకుల పోస్టర్లు



**•-రోడ్డు ప్రమాదంలు జరిగే అవకాశం ఎక్కువగా వున్నా**

**•-చోధ్యం చూస్తున్న మున్సిపల్, ఆర్ అండ్ బీ, పోలీస్ శాఖలు**

**•- ఒక్కొక్కసారి రోడ్డు పక్కకు వాహదారులకు తాకేలా కడుతున్న ప్లెక్సీ లు**

చొప్పదండి /కరీంనగర్, జూన్ 19 (అక్షరం న్యూస్ ) చొప్పదండి పట్టణం లోని ప్రధాన రహదారిపై వున్న డివైడర్ లకి కడుతున్న నాయకుల పోస్టర్లు, ప్లెక్సీ లు,, ఇతర ప్రకటనల వలన రోడ్డు ప్రమాదం లు జరిగే అవకాశం వుంది. ముఖ్యంగా రోడ్డు క్రాసింగ్ ల వద్ద, రోడ్డు మూల మలుపుల వద్ద డివైడర్ పై వున్న సెంట్రల్ లైటింగ్ పోల్స్ కు కడుతున్న ప్లెక్సీ పోస్టర్ల వలన రోడ్డు క్రాస్ చేసే వ్యక్తికీ అవతలి నుంచి ఏ వాహనం వస్తుందో దగ్గరికి వచ్చే వరకు కనపడకుండా ఉండటం వలన రోడ్డు ప్రమాదం లు ఎక్కువగా జరిగే అవకాశం వుంది.

ముఖ్యం గా ప్రధాన రహదారి నుంచి పోలీస్ స్టేషన్ వైపు మలిగే మూల వద్ద డివైడర్ సెంట్రల్ లైటింగ్ పైపులకి పోస్టర్లు, ప్లెక్సీ లు కట్టడం వలన అవతలి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక, కనబడక రోడ్డు ప్రమాదంలు జరిగే అవకాశం వుంది కావున ఇప్పటికయినా మున్సిపల్, పోలీస్ శాఖ వారు ఈయొక్క పోస్టర్స్, ప్లెక్సీ లు కట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిదంగా ఎవరు అయితే ఈ ప్లెక్సీ లు కడుతున్నారో వారికి తగు సూచనలు ఇవ్వాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఈ ప్లెక్స్ లు కట్టె వాళ్ళు రోడ్డుకు అనుకునే ప్లెక్సీ లు కడుతున్నారు. దీనివల్ల రోడ్డుపై వెళ్లే వారికి తాకే విదంగా ఉండి ప్రమాదకారంగాను, ఇబ్బందిగాను వుంది.

# పర్యావరణానికి ఎంతో మేలు చేసే ప్లానెటరీ హెల్త్ డైట్.. అసలేంటిది.. దీన్ని ఎలా పాటించాలి..?

ఈట్-లాన్సెట్ డైట్ లేదా ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమి సహజ వనరులను రక్షించేందుకు రూపొందించిన శాస్త్రీయ ఆహార విధానం. 2019లో 16 దేశాలకు చెందిన 37 మంది నిపుణులు కలిసి ఈ డైట్‌ను రూపొందించారు. 2050 నాటికి 10 బిలియన్ జనాభాకు ఆహారం అందించడంలో పర్యావరణానికి నష్టం కలగకుండా ఉండటం దీని ప్రధాన లక్ష్యం. ఈ డైట్ కఠినమైన నియమాలపై ఆధారపడినది కాదు. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకునే విధంగా ఉంటుంది. ఇందులో కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, గింజలు ప్రధాన భాగంగా ఉంటాయి. అలాగే పాలు, గుడ్లు, మాంసం వంటి వాటిని చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలని ఈ డైట్ సూచిస్తుంది. సాధారణంగా పురుషులకు రోజుకు సుమారు 2,500 కేలరీలు, మహిళలకు 2,000 కేలరీలు సూచిస్తారు. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ప్రపంచవ్యాప్తంగా అనుసరించదగిన రిఫరెన్స్ డైట్‌గా పరిగణించబడుతుంది. ఇది భిన్న ప్రాంతాలు, సంస్కృతులకు అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశం ఇస్తుంది. ముఖ్యంగా మొక్కల ఆధారిత ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని, జంతు ఆధారిత ఆహారాన్ని తగ్గించాలని సూచిస్తుంది.

### ఏయే ఆహారం ఎంత తీసుకోవాలి..

ఈ డైట్‌లో ఆహారం ఎంత మోతాదులో తీసుకోవాలో కూడా సూచించబడుతుంది. రోజుకు కనీసం 300 గ్రాముల కూరగాయలు, 200 గ్రాముల పండ్లు తీసుకోవాలి. సంపూర్ణ ధాన్యాలు సుమారు 232 గ్రాములు తీసుకోవడం ద్వారా శరీరానికి స్థిరమైన శక్తి లభిస్తుంది. అలాగే పప్పులు 75 గ్రాములు, గింజలు 50 గ్రాములు, ఆరోగ్యకరమైన నూనెలు 40 గ్రాములు తీసుకోవాలి.



పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వంటి ప్రోటీన్ ఆహారాలను మాత్రం పరిమితంగా తీసుకోవాలి. రోజుకు 250 గ్రాముల పాలు, గుడ్లు ఒకరోజు విడిచి ఒకటి, చేపలు లేదా చికెన్ 29 గ్రాములు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎర్ర మాంసం (రెడ్ మీట్) కేవలం 14 గ్రాములకే పరిమితం చేయాలి. అదనపు చక్కెర 31 గ్రాములకు మించకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూమి, నీటి వనరులను భారీగా వినియోగిస్తూ, గ్రీన్ హౌస్ వాయువులను అధికంగా విడుదల చేస్తున్నారు. ఈ డైట్‌ను అనుసరించడం ద్వారా పర్యావరణంపై పడే ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎర్ర మాంసం వినియోగం 80-90% వరకు తగ్గించాల్సిన అవసరం ఉంది.

### అనేక లాభాలు..

ప్లానెటరీ హెల్త్ డైట్ అనుసరించడం వల్ల ఆరోగ్యపరమైన అనేక లాభాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటం వల్ల శరీరంలో వాపు, ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. వ్యాధుల బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

హార్వర్డ్ పరిశోధన ప్రకారం, ఈ డైట్‌ను క్రమంగా పాటించడం వల్ల ముందస్తు మరణ ప్రమాదం సుమారు 30% వరకు తగ్గుతుంది. గుండె వ్యాధులు, క్యాన్సర్, స్ట్రోక్, డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 11 మిలియన్ మరణాలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ డైట్ గుండె, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ సహాయపడుతుంది. మొక్కల ఆధారిత ఆహారాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. అలాగే మెదడు పనితీరును కాపాడి మతిమరుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఈ డైట్ ఉపయోగకరంగా ఉంటుంది. ఫైటోకెమికల్స్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి రక్షణ లభిస్తుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్, రెడ్ మీట్ తగ్గించడం ద్వారా క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది

### పర్యావరణ పరిరక్షణ కూడా..

పర్యావరణ పరిరక్షణలో కూడా ఈ డైట్ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను 29% వరకు తగ్గించడమే కాకుండా, ఎరువుల వినియోగాన్ని 21% వరకు తగ్గిస్తుంది. వ్యవసాయ భూమి అవసరాన్ని కూడా 51% వరకు తగ్గించే సామర్థ్యం ఉంది. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి సమతుల్యమైన పరిష్కారం. సరైన ఆహార ఎంపికల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమిని కూడా రక్షించవచ్చు. అయితే ఈ డైట్‌ను అనుసరించే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# మాత్ర వేసుకున్న తర్వాత శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా, శరీరంలో ఏ భాగం నొప్పికి గురైనా వెంటనే గుటుక్కున మాత్ర మింగేస్తుంటారు. కడుపులో అజీర్తి చేసినా, తలనొప్పిగా అనిపించినా మాత్రవైపు దృష్టి మరలుతుంది. మధుమేహమైనా, బీపీని నియంత్రించాలన్నా.. పూటపూటకీ ఓ మందుబిళ్ల పడాల్సిందే. అయితే.. ఈ ట్యాబ్లెట్లకు శరీరంలో నొప్పెక్కడో, సమస్యేంటో ఎలా తెలుస్తుంది? వేసుకున్న కొన్ని నిమిషాలకే ఆ సమస్య నుంచి ఎలా బయటపడేస్తుంది.? వంటి సందేహాలపై ప్రత్యేక వివరణ మీకోసం...

### మాత్ర పనిచేసే విధానం:


మాత్రను మింగిన వెంటనే అది ఈసోఫాగస్(గొంతు మార్గం) ద్వారా కడుపులోకి చేరుతుంది. తర్వాత కడుపులో ఉన్న ఆమ్లాలు దానిని కరిగించడం ప్రారంభిస్తాయి. కొన్ని మాత్రలు వెంటనే కరుగుతాయి. మరికొన్ని ఆలస్యంగా పనిచేస్తాయి. మాత్రలోని ఔషధ పదార్థాలు చిన్నపేగు ద్వారా రక్తంలోకి శోషణం చెందుతాయి. ఇది అత్యంత కీలక దశగా వైద్య నిపుణులు చెబుతారు. రక్తం ద్వారా అందులోని ఔషధాలు శరీరంలోని వివిధ భాగాలకు చేరతాయి. అవసరమైన అవయవం వద్ద అది ఎక్కువగా పనిచేస్తుంది. ఇక్కడే అసలు పని ప్రారంభమవుతుంది.

నొప్పి మందులైతే నాడీ వ్యవస్థపై పనిచేస్తాయి. ఎ ాంటీబయోటిక్స్ అయితే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. ఇతర మందులు హార్మోన్లు లేదా రసాయన చర్యలను నియంత్రిస్తాయి. లివర్(కాలేయం) ఔషధాన్ని రసాయన మార్పులకు గురిచేస్తుంది. దీనినే విఘటన(మెటబాలిజం) అంటారు. చివరగా కిడ్నీలు(మూత్రపిండాలు), మలవిసర్జన ద్వారా ఔషధ అవశేషాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి.

పాటించాల్సిన నియమాలు: సమయపాలన: ఏ మాత్రను ఎలా వేసుకోవాలనే(తిన్న తర్వాత లేదా ఖాళీ కడుపుతో) విషయమై తప్పనిసరిగా వైద్యుల సలహాను పాటించాలి. ఇది మందుల శోషణపై ప్రభావం చూపుతుంది. విశ్రాంతి: మందులు వేసుకున్నాక శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి.

విసర్జన: కాలేయం, మూత్రపిండాలు సరిగ్గా పనిచేస్తున్నప్పుడే మందులు సక్రమంగా పనిచేస్తాయి.

ముఖ్య గమనిక: ప్రతి మందు ఒకేలా పనిచేయదు. డాక్టర్ సూచించిన మోతాదు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. తప్పుగా వాడితే దుష్ప్రభావాలు వచ్చే అవకాశముంది.





# మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

- కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం
- కర్నాటక తీరుకు నిరసనగా తమిళ అసెంబ్లీలో తీర్మానం

చెన్నై,జూన్19: కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరులకు శాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతో పాటు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు సహా ప్రాజెక్టుకు సంబంధించిన ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి కాంగ్రెస్, వీసీకే, ఇతర పార్టీలు మద్దతు తెలిపాయి.

# దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

**పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు**



న్యూఢిల్లీ,జూన్19 దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

# క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించండి

- ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అందుబాటులో ఉండాలి
- సెప్టెంబరు నాటికల్లా మొదటి విడత ఇండ్ల నిర్మాణాలు పూర్తి
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి. పి. గౌతం
- ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై ప్రాజెక్టు డైరక్టర్లు, ఎఇ లతో సమీక్ష

హైదరాబాద్,జూన్19 నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అందుబాటులో ఉంటూ ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి జిల్లాల ప్రాజెక్టు డైరక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం సూచించారు. అంతే కాకుండా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో గ్రామ సమాఖ్యలతో సమన్వయం చేసుకోవాలని పూర్తి పారదర్శకంగా వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లాల ప్రాజెక్టు డైరక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, ఎఇలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబరు నాటికల్లా మొదటి విడతలో మంజూరైన ఇండ్లన్నీ పూర్తి అయ్యేలా, పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నిర్దేశించినట్లుగా మరో లక్ష ఇండ్ల గృహ ప్రవేశాలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఎఇలు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ, లబ్దిదారులు ఇండ్ల పనులను వేగవంతంగా పూర్తి చేసుకునేలా చైతన్య పరచాలని ఎండి గౌతం ఆదేశించారు. వారు ఇంటి నిర్మాణాల కోసం అధిక మొత్తంలో ఖర్చు పెట్టి ఇబ్బందులు పడకుండా వారికి అవగాహన కల్పించాలని ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. లాగే వివిధ ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూం కాలనీల్లోని మౌలిక వసతుల కల్పన పనులను, వాటి కేటాయింపు పక్రియపై సమీక్షిస్తూ, ఆయా కాలనీల్లోనే గృహ నిర్మాణ శాఖ ఎఇల కార్యాలయాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు, గ్రామాల్లో గుడిసెల్లో నివస్తున్న వారి వివరాలను సమగ్రంగా సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, జనరల్ మేనేజర్లు మమత, శ్రీదేవి పాల్గొన్నారు.

# సమగ్ర పంటల విధానమే మేలు !



న్యూఢిల్లీ,జూన్19 దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతుతెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు.

అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ‌ఉాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# క్వాంటం, డీప్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- ఆయా రంగాల్లో కేంద్రంగా అమరావతి
- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ




అమరావతి,జూన్19 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దూరదృష్టి, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్వాంటం, డీప్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు. శుక్రవారం రాజధాని అమరావతిలోని మేధా టవర్స్‌లో రాష్ట్రంలోనే తొలి క్వాంటం ఇంక్యుబేటర్‌ను చండీగఢ్ యూనివర్సిటీ ఎండీ జై ఇందర్ సింగ్ సందు, క్వాంటం వ్యాలీ డైరెక్టర్ శ్రీధర్‌తో కలిసి మోహన కృష్ణ ప్రారంభించారు. ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహంలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన చండీగఢ్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్ర యువతకు సువర్ణావకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్వాంటం ఇంక్యుబేటర్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లకు ప్రపంచ స్థాయి మెంటారింగ్, అత్యాధునిక క్వాంటం కంప్యూటింగ్ వనరులు, పరిశ్రమలతో అనుసంధానం, పెట్టుబడిదారులతో భాగస్వామ్య అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. క్వాంటం వ్యాలీ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తు ప్రపంచాన్ని నిర్దేశిరచే విప్లవాత్మక రంగమని అభివర్ణించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచ స్థాయిలో రాణించాలని రాష్ట్ర యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో ధాత్రి రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అంతకుముందు చండీగఢ్ యూనివర్సిటీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్ తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున మయూరి టెక్‌లో మన్నవ మోహన కృష్ణ అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా క్వాంటం టెక్నాలజీ, పరిశోధన, స్టార్టప్‌ల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ, ఇంక్యుబేషన్ కార్యక్రమాల్లో పరస్పర సహకారానికి మార్గం సుగమం కానుంది. ఈ తాజా ఒప్పందంతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

# అక్షర జ్ఞానంతో ఉన్నత శిఖరాలకు చేరవచ్చు

కొత్తగూడెం,జూన్19 ప్రతి విద్యార్ధి అక్షర జ్ఞానంతో అనుకున్న లక్ష్యాన్ని అధిగమించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ సర్పంచ్ తాటి వాణి అన్నారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను ఉప సర్పంచ్ భూక్యా మోహన్‌రావుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత స్థాయిలో చూడాలని అనుకుంటారని, అందుకు తగినట్లుగా ప్రతి విద్యార్ధి కష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతో ప్రజలకు ఆరోగ్యం

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**

కొత్తగూడెం,జూన్19 పర్యావరణం పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటే మానవాళికి ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండలంలోని మండల పరిషత్, ఫారెస్ట్, ఐటీసీ, ఈజీఎస్ అధికారులు, సర్పంచ్ తో తన ఛాంబర్‌లో వన మహోత్సవంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పారిశ్రామిక వాడగా పిలుస్తున్న సారపాక పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా ఏడాదికి 25 వేల మొక్కల చొప్పున నాలుగేళ్లకు లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకోవాలని, ఇందుకు అన్నిశాఖల అధికారులు కృషి చేయాలన్నారు. సారపాకలో ఖాళీ ప్రదేశాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షించే బాధ్యత తీసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అటవీ శాఖతో పాటు ఐటీసీ పీఎస్పీడీ, ఈజీఎస్ శాఖల అధికారులు పంచాయతీకి మొక్కలను అందించి ఈ లక్ష్యాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయాలన్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని సారపాక పంచాయితీయే కాకుండా గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో ప్రాణ వాయువును ప్రసాదించే మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించినప్పుడే మానవాళికి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయని, దీంతో ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవన్నారు. పారిశ్రామిక ప్రాంతాలతో పాటు గ్రామాలు పచ్చదనంతో కళకళలాడాలని దీనికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఫారెస్ట్ డీఆర్ఓ దారావత్ కృష్ణ, ఐటీడీఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, ఐటీసీ డిప్యూటీ జీఎం విశ్వనాథం, ఈజీఎస్ ఏపీఓ విజయలక్ష్మి, సర్పంచ్ గుగులోత్ కిషోర్‌నాయక్, బీట్ ఆఫీసర్ భీమ్చంద్ పాల్గొన్నారు.

## బాలకృష్ణ మూవీలో
# కాజల్ అగర్వాల్

### ఫస్ట్ లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్




నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబి నేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారి కంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'ఎన్‌బికె111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.

## తెలంగాణ ఫోక్ సింగర్
# నాగదుర్గకు హీరోయిన్ ఛాన్స్



'కాపోళ్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొతుండు' వంటి విలక్షణమైన జానపద గీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూ ట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీ వుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసిం ది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్‌పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్‌కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్‌కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరో యిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రల తో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటిం చిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్‌లోని మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు

- 22న విచారణకు రావాలని అల్లు అర్జున్‌కు సమన్లు



సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో టాలీవుడ్ సినీ నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. జూన్ 22న సోమవారం వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చిక్కడపల్లి పోలీసులు చేర్చారు. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని 1 నుంచి 10వ నిందితులుగా పేర్కొన్నారు. మొత్తం 19 మందికి కోర్టు సమన్లు జారీ చేయగా, 23 మందిపై ఇప్పటికే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న సంధ్య థియేటర్‌లో 'పుష్ప 2' ప్రీమియర్ సందర్భంగా తొక్కిసలాట చోటుచేసు కున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అయితే ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ లీగల్ టీమ్ స్పందిస్తూ, సోమవారం జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ విషయంపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తాం అని తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన వివిధ వ్యక్తులు, సంస్థల పాత్రలు, బాధ్యతలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోమవారం జరగనున్న విచారణ ఈ కేసులో కీలక పరిణామంగా మారనుంది.

# సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి




అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన







వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణా సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధిం చిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# పవర్‌ఫుల్ రోల్‌లో సమంత

### లేడీ ఓరియంటెడ్ మూవీ..మాఇంటి బంగారం

మూడేళ్ల విరామం తర్వాత సమంత చేసిన సినిమా 'మా ఇంటి బంగారం'. దాంతో ఈ సినిమాపై అంచనాలు మొదట్నుంచీ భారీగానే ఉన్నాయి. పైగా 'ఓ బేబీ' తర్వాత నందినీరెడ్డి, సమంత కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినిమాపై ఆసక్తి జనాల్లో మెండుగానే ఉన్నది. ఈ సినిమాలో సమంత తొలిసారి యాక్షన్ రోల్ పోషించారు. ప్రచార చిత్రాలకూ, పాటలకు కూడా మంచి స్పందన రావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ వివాహం చేసుకొని, ఓ సంప్రదాయ కుటుంబంలోకి పెద్ద కోడలుగా ఎంట్రీ ఇస్తుంది స్వర్ణ(సమంత). ఇంట్లోకి వచ్చిన నాటి నుంచి అప్పటికే ఇంట్లో ఉన్న చిన్నకోడలు అనసూయ(శ్రీముఖి)తో పోలుస్తూ అంతా ఆమెను చూస్తుంటారు. అనసూయ ఇంటిని చక్కదిద్దటంలో దిట్ట. కానీ స్వర్ణకు మాత్రం ఆ ఇంటి విషయాలు ఏమీ తెలియవు. కానీ ఎలాగైనా పెద్ద కోడలుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెడుతుంది. దీనికి తన చిన్ననాటి స్నేహితురాలు ఆమెకు సహాయం చేస్తుంటుంది. ఈ విధంగా సరదాగా కథ సాగుతూవుంటుంది. మరోవైపు నక్సలైట్ ముసుగులో దుర్మార్గాలకు తెగబడే నీచుడైన గుల్షన్ దేవయ్య జైల్లో శిక్ష అనుభవిస్తుంటాడు. తనకు అనుచరుడి ద్వారా తన సహ






నక్సలైట్ అయిన ఝాన్సీ ఆచూకీ తెలుస్తుంది. ఆ ఝాన్సీనే స్వర్ణగా పేరు మార్చుకొని బతుకుతున్నదని తెలుసుకున్న గుల్షన్ దేవయ్య, ఎలాగైనా ఝాన్సీని దక్కించుకునేందుకు జైలు నుంచి పారిపోయి వస్తాడు. ఝాన్సీ వేరే వ్యక్తిని పెళ్లాడిందని తెలుసుకొని రగిలిపోతాడు. ఎలాగైనా ఝాన్సీని, ఆమె కుటుంబాన్నీ నాశనం చేయాలనుకుంటాడు. మరి స్వర్ణ రూపంలో ఉన్న ఝాన్సీ తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నది? అసలు స్వర్ణలా ఝాన్సీ ఎందుకు మారింది? ఈ స్వర్ణ ఎవరు? ఆమె కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. కొంచెం రొటీన్ కథే అయినా 'మా ఇంటి బంగారం' విషయంలో కొత్తగా కనిపించిన విషయం ఏంటంటే.. ఇది లేడీ ఓరియెంటెడ్ స్జబెక్ట్ కావడమే. ఈ తరహా కథ ఓ హీరోయిన్ చేయడం మాత్రం కొత్తగా ఉన్నది. ఫస్టాఫ్ సినిమా చూస్తున్నంతసేపూ మహేశ్‌బాబు 'అతడు' సినిమా గుర్తొస్తుంది. అందులో మహేశ్ కిరాయి హంతకుడు.

ఇందులో సమంత నక్సలైట్. అంతే తేడా. కథ పాతదైనా దాన్ని కొత్తగా చెబితే సినిమా హిట్టే. ఈ విషయంలో దర్శకురాలు నందినిరెడ్డి సక్సెస్ అయ్యిందనే చెప్పాలి. ప్రథమార్ధంతో సమంతను కుటుంబ స్త్రీగా చూపించిన తీరు, అక్కడ్నుంచీ నిదానంగా ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్.. సమంతతో చేయించిన పోరాటాలు, ఈ నేపథ్యంలో వచ్చే ఉత్కంఠభరితమైన సన్నివేశాలు మాస్ ఆడియన్స్‌కి బాగా పట్టేస్తాయి. ఫస్ట్‌హాఫ్‌లో ఇంట్లో జరిగే కామెడీ సన్నివేశాలు, కారు ఛేజింగ్ సీక్వెన్స్ చాలా బావున్నాయి. ఇక సెకండాఫ్‌లో కథ కాస్త స్లో అయినట్టు అనిపిస్తుంది. తనెవరో తన ఇంట్లో అందరికీ రివీల్ చేసే క్రమంలో కాస్త కథ నిదానించిన ఫీలింగ్ కలుగుతుంది. హీరోలకు ఏ మాత్రం తీసిపోకుండా అద్భుతమైన పోరాటలు చేసి శభాష్ అనిపించుకున్నది సమంత. ఈ సినిమాలో ఝాన్సీగా, స్వర్ణగా రెండు షేడ్స్‌ని అద్భుతంగా పోషించింది. తనదైన శైలిలో కామెడీ కూడా పండించింది. 'స్త్రీ అంటే ఇలా ఉండాలి..' అనిపించేలా ఆమె పాత్ర సాగింది. సమంత తర్వాత ఈ సినిమాలో చెప్పుకోవాల్సిన పాత్ర గుల్షన్ దేవయ్యదే. తన విలనీ అదిరిపోయింది. చెడ్డ లక్షణాలున్న నక్సలైట్ నాయకుడిగా తను ఒదిగిపోయి అభినయించాడు. ఇక మిగతా వారంతా కూడా పరిధిమేర తమ పాత్రలను రక్తికట్టించారు. రాజ్ నిడిమోరు పాత కథే రాసినా.. డైరెక్టర్ నందినీరెడ్డి కొత్త ట్రీట్ చేసి, జనరంజకంగా సినిమాను తెరకెక్కించింది. సెకండాఫ్ విషయంలో కాస్తంత శ్రద్ధ పెడితే బావుండేది. సంతోష్ నారాయణ సంగీతం సినిమాకు పెద్ద ఎస్సెట్. నేపథ్య సంగీతం బావుంది. ఓం ప్రకాశ్ కెమెరా పనితనం అభినందనీయంగా ఉంది. మొత్తంగా లేడీ ప్రేక్షకులు, సమంత అభిమానులు గర్వపడేలా, మాస్ ప్రేక్షకులకు నచ్చేలా, ఫ్యామిలీ ఆడియన్స్ మెచ్చేలా సినిమా ఉన్నదని చెప్పొచ్చు.

# ఐపీఎల్ 2027 షెడ్యూల్ లో మార్పు!?

తీవ్రమైన ఎండలు, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఐపీఎల్ 2027 షెడ్యూల్‌లో కీలక మార్పులు చేయాలని బీసీసీఐ భావిస్తోంది. టోర్నీని రెండు వారాలు ముందే, అంటే మార్చి 10 నుంచి మే 15 మధ్య నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. అయితే ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే ఆలోచన ప్రస్తుతానికి లేదని, అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్‌ల వల్ల రెండు నెలల విండోను విస్తరించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) షెడ్యూల్‌లో కీలక మార్పు చేయాలని భావిస్తోంది. 2027 సీజన్ నుంచి టోర్నమెంట్‌ను కాస్త ముందుగానే ప్రారంభించాలని యోచిస్తోంది. ఎండలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల ఆటగాళ్లు, అభిమానులు ఇబ్బంది పడటంతో పాటు.. మ్యాచ్ నిర్వహణ కూడా కష్టంగా మారుతోందని బీసీసీఐ భావిస్తోందట. అందుకే కాస్త ముందుగానే సీజన్ ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా అయితే మార్చి చివరి నుంచి మే చివరి వరకు ఉండే ఐపీఎల్ షెడ్యూల్ ఉంటుంది. ఐపీఎల్ 2026 షెడ్యూల్ సైతం.. మార్చి 28న మొదలై, మే 31 వరకు కొనసాగింది. దానిని ఇకపై మార్చి 10 నుంచి మే 15 మధ్యకు మార్చేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు సాగితే 2027 ఐపీఎల్ సీజన్.. మార్చి రెండో వారంలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రుతుపవనాల రాకకు ముందు కురిసే వర్షాల కారణంగా ఐపీఎల్‌లో చివరి మ్యాచ్‌లు ప్రభావితం అవుతున్నాయని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. "ఈ సంవత్సరం ఐపీఎల్ మార్చి 28న మొదలై మే 31 నాటికి ముగిసింది. అయితే, మే 15 తర్వాత టోర్నమెంట్ చివరి దశలో వర్షాలు పడే లేదా రుతుపవనాల సీజన్ మొదలయ్యే అవకాశం ఉందనే ఆందోళన ఉంది. మరోవైపు, తీవ్రమైన వేడి వాతావరణం ఆటగాళ్లకు గానీ, ప్రేక్షకులకు గానీ అనుకూలంగా ఉండదు. అందుకే టోర్నీని 2 వారాలు ముందే ప్రారంభించాలని బోర్డు భావిస్తోంది. దీనిపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో చర్చ జరుగుతోంది" అని బీసీసీఐ కార్యదర్శి తెలిపారు. "ప్రస్తుతానికైతే ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెంచడం అనేది సాధ్యం కాదు. 74 మ్యాచ్‌ల ఫార్మాట్‌ను విస్తరించే ప్రణాళికులు ఇప్పుడు లేదు. ఎందుకంటే వివిధ దేశాల నుంచి వచ్చే ఆటగాళ్లకు సంబంధించిన అనేక అంశాలను మనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎంతో కష్టపడితేనే ఐపీఎల్ కోసం రెండు నెలల విండో దొరుకుతోంది. అంతక

## సౌత్‌కొరియాపై మెక్సికో గ్రాండ్ విక్టరీ



2026 ఫిఫా ప్రపంచకప్?లో మెక్సికో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. గ్రూప్ ఏ లో భాగంగా తాజాగా గ్వాడలజారాలో స్టేడియంలో దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్?లో మెక్సికో 1-0 తేడాతో నెగ్గింది. 50వ నిమిషంలో గోల్ సాధించిన రోమో మెక్సికో జట్టులో హీరోగా నిలిచాడు. తాజా విజయంతో ఈ ఫిఫా వరల్డ్?కప్?లో రౌండ్ ఆఫ్ 32కు అర్హత సాధించిన తొలి జట్టుగా మెక్సికో నిలిచింది. ఈ వరల్డ్?కప్?లో అత్యుత్తమ జట్టైన మెక్సికో- దక్షిణ కొరియా మ్యాచ్? అనుకున్నట్లే హోరాహోరీగా సాగింది. రెండు పటిష్ఠమైన జట్ల మధ్య పోరు అభిమానులకు కిక్ ఇచ్చింది. తొలి అర్ధభాగం హోరాహోరీగా సాగింది. బంతిని మెక్సికోనే ఎక్కువగా నియంత్రించింది. ప్రత్యర్థిపై దాడి చేయడానికి ప్రయత్నించింది. మరోవైపు, దక్షిణ కొరియా వ్యూహాత్మకంగా ఆడింది. ఎక్కువగా ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగింది. దీంతో తొలి భాగంలో ఏ జట్టు కూడా గోల్ కొట్టలేకపోయింది. ఇక రెండో అర్ధభాగం ప్రారంభమైన ఐదు నిమిషాలకే తొలి గోల్ నమోదైంది. నాలుగో నిమిషంలో మెక్సికో ప్లేయర్ జీసస్ గల్లార్డో కొట్టిన ఒక లో షాట్ సైడ్ నెట్స్?లోకి వెళ్లడంతో మెక్సికోకు గేమ్?పై పట్టు దొరికింది. ఆ తర్వాత నిమిషంలోనే, దక్షిణ కొరియా ఆటగాళ్లు కిమ్ సియోంగ్ గ్యూ-లీ గిహ్యుక్ మధ్య గందరగోళం ఏర్పడింది. ఇదే ఛాన్స్? తీసుకున్న రోమో అదిరే షాట్?తో బంతిని నెట్స్?లోకి పంపించాడు. అంతే మ్యాచ్?లో సహ ఆతిథ్య దేశం మెక్సికో తొలి గోల్? సాధించింది. దీంతో స్టేడియం ఒక్కసారిగా ఊగిపోయింది. దీంతో మెక్సికో లీడ్?లోకి దూసుకెళ్లింది. ఆ తర్వాతా మ్యాచ్ రసవత్తరంగానే సాగింది. మెక్సికోకు రెండో గోల్ దక్కకుండా దక్షిణ కొరియా అడ్డుకుంది. 75వ నిమిషంలో మెక్సికో ప్లేయర్ రౌల్ జిమెనెజ్ కొట్టిన షాట్‌ను కిమ్ అద్భుతంగా అడ్డుకున్నాడు. దీనికి మెక్సికో కూడా అదే రేంజ్?లో బదులిచ్చింది. మ్యాచ్? మరో మూడు నిమిషాల్లో ముగుస్తుందనగా, చో గుసుంగ్ - యాంగ్ హ్యున్‌జున్‌లు నమ్మశక్యం కాని రీతిలో బంతిని రెండుసార్లు గోల్ వైపునకు పంపించారు. దీనిని సమర్థంగా అడ్డుకున్న మెక్సికో విజయం ఖరారు చేసుకుంది. 'ఈ మ్యాచ్? హోరాహోరీసా సాగింది. మా ప్రత్యర్థి ఎంత బలమైందో మాకు ముందే తెలుసు. ఆ జట్టు మమ్మల్ని ఒత్తిడిలోకి నెట్టింది. మాకు అస్సలు ఛాన్స్?లు ఇవ్వలేదు. చివరికి, ఏదో ఒక చిన్న పొరపాటే ఫలితాన్ని నిర్ణయిస్తుందని అనిపించింది. అది గొప్ప మ్యాచ్ ఏమీ కాదు, పైగా ప్రత్యర్థి జట్టు మాకు పెద్దగా ఏమీ చేయనివ్వలేదు' అని మెక్సికో కోచ్ జేవియర్ అగ్యురే మ్యాచ్ అనంతరం అన్నారు. ఒకవేళ ఈ మ్యాచ్?లో దక్షిణ కొరియా నెగ్గి ఉంటే రౌండ్ 32కు అర్హత సాధించిన తొలి టీమ్?గా నిలిచేది. ఎందుకంటే గ్రూప్ ఏలో మెక్సికో, దక్షిణ కొరియా జట్లు తమతమ తొలి మ్యాచ్?ల్లో విజయం సాధించాయి. అయితే తొలి మ్యాచ్?లోని ఫామ్?ను మెక్సికో కొనసాగిస్తూ గెలుపు నమోదు చేయగా, మొదటి గేమ్?లోని మ్యాజిక్?ను దక్షిణ కొరియా రిపీట్ చేయలేకపోయింది. ప్రస్తుతం గ్రూప్ ఏ లో ఆరు పాయింట్లతో మెక్సికో టాప్?లో ఉండగా, దక్షిణ కొరియా మూడు పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇక ఒక్కో పాయింట్?తో చెకియా, సౌతాఫ్రికా వరుసగా మూడు, నాలుగు ప్లేస్?ల్లో కొనసాగుతున్నాయి.

## హర్షిత్ రాణా రీ-ఎంట్రీ..!?



ఇండియా ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణాకు సంబంధించిన ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. అఫ్ఘానిస్తాన్‌తో శనివారం చెన్నైలో జరగబోయే లాస్ట్ వన్డే మ్యాచ్ కోసం అతన్ని ఇండియన్ క్రికెట్ టీమ్ స్క్వాడ్‌లోకి సెలెక్ట్ చేశారు. త్రీ-మ్యాచ్ వన్డే సిరీస్‌లో ఫస్ట్ రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇండియా ఆల్రెడీ 2-0 తో సిరీస్ కైవసం చేసుకుంది. ఇప్పుడు క్లీన్‌స్వీప్ టార్గెట్‌గా పెట్టుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆర్మీకి హర్షిత్ రాణా రాక మరింత బలాన్ని ఇచ్చింది. టీ20 వరల్డ్ కప్ 2026 కు ముందు ముంబైలో సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ టైమ్‌లో హర్షిత్ మోకాలి గాయానికి గురయ్యాడు. దీంతో ఆ మెగా టోర్నమెంట్‌తో పాటు కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ కు కూడా కంప్లీట్‌గా దూరమయ్యాడు. గాయం తర్వాత హర్షిత్ రాణా చాలా రోజులు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో చేరిన హర్షిత్, అక్కడ తన రిహాబిలిటేషన్‌ను సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాత చెన్నై వేదికగా అఫ్ఘానిస్తాన్‌తో జరిగే మ్యాచ్ కోసం టీమ్‌తో జాయిన్ అయ్యాడు. "బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ పూర్తి చేసుకున్న హర్షిత్ రాణా చెన్నైలో వన్డే స్క్వాడ్‌తో కలిశాడు" అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఒక మీడియా రిలీజ్ లో స్పష్టం చేశారు. 24 ఏళ్ల హర్షిత్ రాణా ఇండియా తరఫున ఇప్పటివరకు 14 వన్డేలు ఆడి 27.38 యావరేజ్, 6.21 ఎకానమీ రేట్‌తో 16 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగిన హోమ్ టీ20ఐ సిరీస్‌లో అతను లాస్ట్ టైమ్ ఇండియా జెర్సీలో కనిపించాడు. అయితే గాయం నుంచి కోలుకున్న వెంటనే అతనికి సెలెక్టర్లు వరుస ఛాన్సులు ఇస్తున్నారు. అఫ్ఘాన్ మ్యాచ్‌తో పాటు రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లలో ఆడే ఇండియా స్క్వాడ్‌లో కూడా హర్షిత్‌కు ప్లేస్ దక్కింది. ఈ రెండు టూర్లలో ఇండియా మొత్తం ఏడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న హర్షిత్ రాణా చేపాక్ పిచ్‌పై ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తాడనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# టీమ్ ఇండియాకు ధోని లాంటి మెంటార్ కావాలి!




భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లక్ష్యంగా మాజీ పేసర్ ఎస్. శ్రీశాంత్ చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం ఉన్న టీమ్ ఇండియా సెటప్‌కు గౌతమ్ గంభీర్ కంటే ఎంఎస్ ధోని లాంటి వ్యక్తి అవసరమని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. టీమ్ ఇండియాకు ప్రస్తుతం ఆటగాళ్లు మనస్ఫూర్తిగా గౌరవించే ఒక మార్గదర్శకుడు కావాలని, అంతేగానీ "ఆటగాళ్ల వెనుక మాట్లాడేవాడు" లేదా టీవీల్లో ప్రశంసల కోసం ప్రాకులాడే వ్యక్తి కాదని గంభీర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కాగా, ఈ పూర్తి ఇంటర్వ్యూ ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భారత్ ఎందుకు ఇబ్బంది పడిందనే ప్రశ్న శ్రీశాంత్‌కు ఎదురవగా.. ఆ ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుంటూ.. "అప్పుడు కోచ్ ఎవరు?" అని ఎదురుప్రశ్న వేశాడు. ఆటగాళ్ల ఎంపికకు సంబంధించిన సమస్యలపై స్పందిస్తూ.. దీనికంతటికీ గంభీరే కారణమన్నట్లుగా మాట్లాడాడు. "ముందు కోచ్‌ను మార్చండి. భారత్‌కు ఇప్పుడు కావాల్సింది కోచ్ కాదు, ఒక మంచి మెంటార్" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. ఒక షో సజావుగా సాగడానికి డైరెక్టర్ ఎంత ముఖ్యమో, జట్టుకు కోచ్ కూడా అంతే ముఖ్యమని చెబుతూనే.. తనకు సాధారణంగా కోచ్‌లపై ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ అంతర్జాతీయ జట్లకు సాంప్రదాయ కోచ్‌ల కంటే మెంటార్ల అవసరమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయ పడ్డాడు. గంభీర్ అనుసరిస్తున్న కోచింగ్ విధానం ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోందని శ్రీశాంత్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఫెయిల్ అయితే జట్టు నుంచి తీసేస్తామనే భయాన్ని కల్పించి, ఆటగాళ్లను ఒక కఠినమైన వ్యవస్థలోకి నెట్టే కోచ్ జట్టుకు అవసరం లేదని అన్నాడు.దీనికి ఉదాహరణగా ఎంఎస్ ధోనిని ప్రస్తావిస్తూ.. ధోని ఎప్పుడూ అలా వ్యవహరించలేదని చెప్పాడు. "జనాలు ఏమైనా చెప్పుకోవచ్చు.. కానీ ధోని ఆలోచనా విధానం, అతను ఆటగాళ్లలో నింపిన ఆత్మవిశ్వాసమే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాయి" అని శ్రీశాంత్ గుర్తుచేశాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో గంభీర్‌కు మితిమీరిన క్రెడిట్ ఇవ్వడం సరికాదని శ్రీశాంత్ వాదించాడు. "మైదానంలో చెమటోడ్చి ఆడేది ఆటగాళ్లు, కాబట్టి ఆ గుర్తింపు, క్రెడిట్ వారికే దక్కాలి" అని అన్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆటగాళ్ల ప్రదర్శనే అక్కడ అత్యంత కీలకమని చెప్పాడు. "ఒకవేళ సంజూ శాంసన్ రాణించకపోయినా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ సరిగ్గా చేయకపోయినా, లేదా సమయానికి బౌలింగ్ మార్పులు జరగకపోయినా మనం గెలిచేవాళ్లమా? మైదానంలోకి వచ్చి కోచ్ ఏమైనా నిర్ణయాలు తీసుకున్నాడా?" అంటూ శ్రీశాంత్ ఘాటుగా ప్రశ్నించాడు. 2013 స్పాట్ ఫిక్సింగ్‌లో శ్రీశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ధోని వల్లే శ్రీశాంత్ కెరీర్ నాశనం అయ్యిందంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు శ్రీశాంత్ ధోనిపై ప్రశంసలు కురిపించడం కాస్త విచిత్రంగానే ఉంది.

## డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ

మేజర్ లీగ్ 2026లో ఫాఫ్ డుప్లెసిస్ తొలి మ్యాచ్‌లోనే విధ్వంసం సృష్టించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టెక్సాస్ తరఫున ఆడిన డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 41 ఏళ్లలో 46 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ మేజర్ లీగ్‌లో ఫాఫ్ 4 సెంచరీలతో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో సియాటెల్ ఓపెనర్ టిమ్ సైఫర్ట్ కూడా సెంచరీ చేయడం విశేషం. ఈ మ్యాచ్‌లో టెక్సాస్ ఘన విజయం సాధించింది.ఫాఫ్ డుప్లెసిస్ వావ్ అనిపించే ప్రదర్శన చేశాడు. 41 ఏళ్ల వయస్సులో కేవలం 46 బంతుల్లోనే సెంచరీ బాది తనలో ఇంకా సత్తా ఉంది అనిపించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఎప్పుడో గుడ్ బై చెప్పిన డుప్లెసిస్.. టీ20 లీగ్‌లలో మాత్రం కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున చివరిసారిగా ఆడిన ఈ లెజెండ్.. ఐపీఎల్ 2026కు ముందు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాడు. తాజాగా యూఎస్‌ఏ వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ టీ20లో చెన్నై సూపర్ కింగ్స్‌కి టెక్సాస్ సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. టెక్సాస్‌కి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఫాఫ్ డుప్లెసిస్ మేజర్ లీగ్ 2026 తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాది జట్టుకు మరచిపోలేని విజయాన్ని అందించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో 221 పరుగుల లక్ష్యాన్ని నాటౌట్‌గా నిలిచి ఛేదించాడు. మేజర్ లీగ్‌లో నాలుగు సెంచరీలు నమోదు చేసిన ఫాఫ్, ఈ లీగ్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచాడు. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సియాటెల్ ఆర్కాస్ టెక్సాస్ బౌలర్లను ఉతికారేసింది.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి పంత్ రీఎంట్రీ!?



లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య బాధ్యతలు కోల్పోయిన రిషభ్ పంత్ తిరిగి తన పాత ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నోసూపర్ జెయింట్స్ పేలవ ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే. 14 మ్యాచ్‌లకు 4 మాత్రమే గెలిచిన లక్నో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగుస్థానంలో నిలిచింది. ఈ సీజన్ ముగిసిన వెంటనే సారథ్య బాధ్యతల నుంచి రిషభ్ పంత్ తప్పుకున్నాడని, అతనే ఈ నిర్ణయం తీసుకున్నాడని లక్నో సూపర్ జెయింట్స్ ప్రకటించింది. లక్నో జట్టులో చేరిన తర్వాత రిషభ్ పంత్ వ్యక్తిగత ప్రదర్శన కూడా దెబ్బతిన్నది. లక్నో ఫ్రాంచైజీ వర్గాలు కూడా రిషభ్ పంత్ ఆట పట్ల అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే రిషభ్ పంత్ తన పాత ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ వైపు చూస్తున్నాడని టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొంది. ఇప్పటికే ఈ విషయంపై లక్నో ఓనర్ సంజీవ్ గోయెంకాను వివరణ కోరామని, ఆయన ఇంకా స్పందించలేదని తమ కథనంలో రాసుకొచ్చింది.ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రిషభ్ పంత్ గుర్తింపు పొందాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో అతన్ని లక్నో సూపర్ జెయింట్స్ రూ.27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. అయితే అత్యధిక ప్రైజ్ ట్యాగ్ ఒత్తిడినో లేక మరే కారణమో తెలియదు కానీ రెండు సీజన్లలో రిషభ్ పంత్ తీవ్రంగా నిరాశపర్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 269, ఐపీఎల్ 2026 సీజన్‌లో 312 పరుగులు మాత్రమే చేశాడు. బ్యాటర్‌గా విఫలమైన అతను కెప్టెన్‌గానూ తడబడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలోనే అతన్ని సారథ్య బాధ్యతల నుంచి తప్పించాలనే డిమాండ్లు వినిపించాయి. లీగ్ ఆరంభంలో రిషభ్ పంత్‌ను సంజీవ్ గోయెంకా మందలించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పరిణమాల నేపథ్యంలోనే రిషభ్ పంత్ లక్నో సూపర్ జెయింట్స్‌ను వీడేందుకు సిద్ధమయ్యాడనే వార్తలు హల్‌ఛల్ చేస్తున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్‌కు రీఎంట్రీ ఇచ్చినా సారథిగా కొనసాగేందుకు రిషభ్ పంత్ సుముఖంగా లేదని, కేఎల్ రాహుల్‌ను సారథిగా నియమించేందుకు ఫ్రాంచైజీ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లోనే ఈ నిర్ణయం తీసుకుంటారని ప్రచారం జరిగినా.. అది జరగలేదు. ఐపీఎల్ 2027 సీజన్‌లో కేఎల్ రాహుల్ ఢిల్లీని నడిపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఢిల్లీ క్యాపిటల్స్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్.. లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రూ.13.25 కోట్ల భారీ ధరకు కుల్దీప్ యాదవ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రిటైన్ చేసుకుంది. ఐపీఎల్ 2022లో ఢిల్లీలో చేరిన కుల్దీప్.. 21 వికెట్లతో సత్తా చాటాడు. కానీ ఆ తర్వాత 10, 16, 15, 10 వికెట్లతో నిరాశపర్చాడు. కుల్దీప్ యాదవ్‌ను వదులుకునేందుకు ఢిల్లీ కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## 2027 వన్డే ప్రపంచకప్‌లో ఇషాన్ ఖాయం: గవాస్కర్

అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో 125 పరుగులతో చెలరేగిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుత ఫామ్ చూస్తుంటే వన్డే ప్రపంచకప్ 2027 కోసం ఇషాన్‌కు అప్పుడే దక్షిణాఫ్రికా వీసా దొరికినట్లు అనిపిస్తోందని, అతడిని జట్టు నుంచి తప్పించడం అసాధ్యమని గవాస్కర్ జోస్యం చెప్పారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ సైతం ఇషాన్ బ్యాటింగ్ శైలిని కొనియాడాడు. టీమిండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ .. ఇటీవల దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్ 2025లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా తరఫున కమ్‌బ్యాక్ ఇచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. ప్రస్తుతం భారత జట్టులో కీలక ఆటగాడిగా మారిపోయాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడు. తాజాగా అఫ్ఘానిస్థాన్‌తో రెండో వన్డేలో మెరుపు శతకంతో సత్తాచాటాడు. దీంతో జట్టు నుంచి అతడిని తప్పించలేని పరిస్థితి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో ఇదే విషయంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాట్లాడారు. ఇషాన్ కిషన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ 2027లో తప్పకుండా ఆడతాడని జోస్యం చెప్పారు. నాకు తెలిసి ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా (వన్డే ప్రపంచకప్ 2027 కోసం) వచ్చి ఉంటుందని అనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో ఇషాన్ జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చక్కగా రాణిస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారిపోయాడు" అని సునీల్ గవాస్కర్ అన్నారు. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ కిషన్.. బ్యాటింగ్‌కు ఫిదా అయిపోయాడు. ఫార్మాట్, ఆడే పొజిషన్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడని చెప్పుకొచ్చాడు. అతడు టీమిండియా తరఫున ఆడుతున్నంత కాలం.. ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నది పట్టించుకోకుండా రన్స్ చేస్తాడని కొనియాడాడు. ముఖ్యంగా ఇషాన్ ఎక్స్‌ట్రా కవర్ మీదుగా కొట్టే షాట్లు తనకు ఎంతో ఇష్టమని గ్రేమ్ స్వాన్ వ్యాఖ్యానించాడు. కాగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్.. 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. హాఫ్ సెంచరీ చేసేందుకు 52 బంతులు తీసుకున్న అతడు.. తర్వాత టాప్ గేర్‌లోకి వచ్చాడు.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609